నిబంధనలకు నీళ్లు

- మినరల్ వాటర్‌పై జనం ఆసక్తి
- పుట్టగొడుగుల్లా ప్లాంట్ల ఏర్పాటు
- ఐఎస్ఐ ధ్రువీకరణ లేకుండానే విక్రయాలు
- ప్రజారోగ్యంతో చెలగాటం


కావలిలో ఓ ఇంటి ముందు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ట్యాంకు

కావలి: ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మినరల్ వాటర్‌కు గిరాకీ ఏర్పడింది. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా గొంతు తడుపుకొనేందుకే ఒక్కో కుటుంబం నెలకు వందలాది రూపాయలు ఖర్చు చేస్తోంది. ఇదే అదనుగా కొందరు నిబంధనలకు నీళ్లొదిలి మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. అరకొరగా శుద్ధి చేసిన నీటినే మినరల్‌వాటర్ పేరుతో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా నీటిలో రుచికోసం విచ్చలవిడిగా రసాయనాలను కలుపుతూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ప్రజల అమాయకత్వం...అధికారుల నిర్లక్ష్యం వెరసి మినరల్ వాటర్ ప్లాంట్లకు కాసులు కురిపిస్తున్నాయి. జీవనశైలిలో మార్పులు, ఆరోగ్యంపై పెరుగుతున్న శ్రద్ధ కారణంగా ప్రతిఒక్కరూ మినరల్ వాటర్ తాగేందుకే ఆసక్తి చూపిస్తుండడంతో వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కావలి డివిజన్ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా 200కు పైగా వాటర్ ప్లాంట్లు వ్యాపారం సాగిస్తున్నాయి. ఇందులో ఒక్కటంటే ఒక్కటి కూడా నిబంధనలు పాటించడం లేదు. సాధారణంగా ప్రజలకు శుద్ధి చేసిన నీటిని విక్రయించాలంటే తప్పనిసరిగా ఐఎస్ఐ (ఇండియన్ స్టాండర్డ్ ఇనిస్టిట్యూషన్) అనుమతి పొందాలి. ఇందుకోసం నీటి శుద్ధి కేంద్రాల్లో రసాయన, సూక్ష్మజీవశాస్త్ర ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలి. ఎప్పటికప్పుడు నీటిని శుద్ధి చేసేముందు, చేసిన తరువాత విధిగా ఆయా నిపుణుల చేత పరీక్షలు చేయించి నివేదికలు రూపొందించాలి. ఈ నివేదికలను ఐఎస్ఐ సిబ్బంది పరిశీలిస్తారు. నిబంధనలకు అనుగుణంగా నివేదికలు ఉంటేనే నీటి వ్యాపారానికి అనుమతినిస్తారు. ఇవన్నీ జరిగిన తరువాతే నీటిని క్యాన్లు, సీసాల్లో నింపి విక్రయించాలి. అదే సమయంలో క్యాన్‌పై కంపెనీ పేరు, తయారైన తేదీ, ఎప్పటిలోగా వినియోగించాలి, తదితర వివరాలను స్పష్టంగా ముద్రించాలి. కావలి డివిజన్‌లో ఉన్న వాటర్‌ప్లాంట్లకు ఎటువంటి ల్యాబొరేటరీలు లేవు. ప్రభుత్వ నిబంధనల మేరకు ల్యాబ్‌ల ఏర్పాటు, నిర్వహణకు రూ.4లక్షల వరకు వ్యయం అవుతుంది. దీంతో వీటిని ఏర్పాటు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. మినరల్ వాటర్ పేరుతో నీటిని సాధారణ ఆర్వో (రివర్స్ ఆస్మోసిస్) ప్లాంట్ల ద్వారా అరకొరగా శుద్ధి చేసి విక్రయిం చేస్తున్నారు. నీటని నింపే క్యాన్లను కూడా సరిగా శుభ్రం చేయడం లేదు. క్యాన్లు లోపల పాచిపట్టి ఉంటున్నాయి. ఇలాంటి క్యాన్లలోంs నీటినే దుకాణాలు, గృహావసరాలకు ఆటోల ద్వారా తరలిస్తూ అడ్డగోలుగా సొమ్ము చేసుకుంటున్నారు. 20లీటర్ల క్యాన్‌ను రూ.10 నుంచి రూ.20 వరకు ప్రతిరోజూ లక్షకుపైగా విక్రయిస్తున్నారు. ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లను తరచూ తనిఖీ చేయాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


పేరు లేకుండానే సరఫరా చేస్తున్న వాటర్ క్యాన్లు

తనిఖీ చేస్తాం

మినరల్ వాటర్ ప్లాంట్లను తనిఖీ చేస్తాం. నిబంధనలు పాటించకపోతే చర్యలు చేపడతాం. ప్రజల నుంచి లిఖిత పూర్వకమైన ఫిర్యాదులు అందితే వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

–శ్రీదేవి, ఎంపీడీఓ, కావలి

సోలార్ స్టార్టర్ చోరీపై ఫిర్యాదు

ఉదయగిరి: మండలంలోని సంజీవరాజుపల్లికి చెందిన బీ ఆంజనేయరాజు తన పొలంలో ఏర్పాటు చేసుకున్న సోలార్ పంపుసెట్ స్టార్టర్‌ను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏడేళ్ల క్రితం ప్రభుత్వం మంజూరు చేసిన సోలార్ పంపుసెట్ ఉపయోగించుకుంటూ పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నానని తెలిపారు. స్టార్టర్‌ను దొంగలు తీసుకెళ్లడంతో సాగులో ఉన్న పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు విచారించి తగిన న్యాయం చేయాలని కోరాడు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని టౌన్–1 ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ ఎస్‌కే నాగూర్ గురువారం తెలిపారు. బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందున సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు.

క్లుప్తంగా

రేపు నీటి తీరువా వసూళ్లపై అవగాహన సమావేశం

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో నీటి తీరువా వసూళ్లపై అవగాహన సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని గురువారం తెలిపారు. ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు, ఎంపీడీఓలు, ఇరిగేషన్ ఏఈలు, వ్యవసాయశాఖ అధికారులు, వీఆర్వోలు, వీఏఓలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



ఆత్మకూరు: పట్టణంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయీస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని విద్యుత్ శాఖ ఈఈ ఐ శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఏడీఈ బీ చిన్నస్వామినాయక్, ఏఈలు, యూనియన్ల నాయకులు జీ శివప్రసాద్, కే హజరత్తయ్య, ఎస్ విజయరామిరెడ్డి, మహేష్, మస్తాన్, లక్ష్మీనరసింహారెడ్డి, జీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో మెరుగైన విద్యుత్ సరఫరాను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ షేక్ జమీలాబేగం తెలిపారు. పట్టణంలోని హిల్ రోడ్డు ప్రాంతంలోని ఆటోనగర్ సమీపంలో ఉన్న మూడు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నూతన వైర్ల ఏర్పాటు పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పట్టణంలోని పలుచోట్ల మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్‌తీగలు తరచూ తెగిపోతూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో నూతన విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు సుబ్రమణ్యం, కృష్ణారెడ్డి, శివయ్య, తదితరులు ఉన్నారు.

న్యాక్‌లో పీఎం విశ్వకర్మ దరఖాస్తుదారులకు శిక్షణ

ఉదయగిరి: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న న్యాక్ కేంద్రంలో పీఎం విశ్వకర్మకు దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆ కేంద్రం నిర్వాహకుడు లక్కినేని ప్రకాష్ గురువారం తెలిపారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ కింద రిజిస్ట్రేషన్ చేసుకున్న దర్జీలు, తాపీమేస్త్రిలు, ధోబీలు, చర్మకారులకు ఐదురోజుల పాటు శిక్షణ అందజేస్తామని చెప్పారు. వివరాలకు 94923 34643 నంబరును సంప్రదించాలని కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: ప్రభుత్వం ఎస్సీల స్వయం ఉపాధికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై రుణాలను మంజూరు చేస్తోందని మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్ గురువారం తెలిపారు. 21 నుంచి 50 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. అర్హులైన వారు మే 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నైపుణ్యాభివృద్ధిపై అవగాహన

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.సమగ్ర శిక్షణ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో లెర్నింగ్ స్కిల్స్‌పై ఇంటర్నల్‌షిప్‌ను నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రేమ్‌చంద్, ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

శివకుమారశర్మకు అభినందనలు



ఆత్మకూరు: పట్టణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు మేళ్లచెరువు శివకుమారశర్మ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికవడంపై పలువురు గురువారం అభినందనలు తెలిపారు. శివాలయంలో శివకుమారశర్మ దంపతులను సత్కరించారు. ఇందుకూరుపేట లలితాపీఠం వ్యవస్థాపకులు రామాయణం మహేష్‌శర్మ, కవి శిరోమణి శర్మ దంపతులు, జగదీష్‌శర్మ, చక్రవర్తి, అపర్ణ, మోహన్, శేషగిరిరావు, రామయ్య, మురళీధర్, సురేష్ పాల్గొన్నారు.

బీడీకార్మికులకు ఉచితంగా వైద్యపరీక్షలు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు బీసీకాలనీలోని బీడీ కార్మికులకు పట్టణంలోని అపోలో క్లినికల్ ల్యాబొరేటరీ ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా బీపీ,షుగర్, తదితర పరీక్షలు నిర్వహించారు. తమ ల్యాబొరేటరీ వార్షికోత్సవం సందర్భంగా పరీక్షలను నిర్వహించినట్లు నిర్వాహకుడు ఎస్‌కే సందానీబాషా తెలిపారు.

భూసార పరీక్షలపై విస్తృత అవగాహన


మాట్లాడుతున్న ఏఓ ఆంజనేయులునాయక్

ఉదయగిరి: భూసార పరీక్షలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులునాయక్ వీఏఏలకు సూచించారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో భూసారం పరిరక్షణ కార్యక్రమంపై వ్యవసాయశాఖ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలను సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఎరువుల పెట్టుబడులను తగ్గించుకోవచ్చని చెప్పారు. ఖరీఫ్ పంటల సాగుకు ముందుగా రైతులు భూసార పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల్లో 340 భూసార పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 12 రకాల మూలకాలనిర్ధారణ చేసి రైతులకు భూసార పరీక్షల పత్రాలను అందజేస్తామన్నారు.

పక్కాగృహాలు మంజూరు చేయాలని వినతి



ఉదయగిరి : తమకు నివేశన స్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని ఉదయగిరి పంచాయతీ కార్మికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి జీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపీడీఓ అప్పాజీకి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉదయగిరి పంచాయతీలో సుమారు 33 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. నివేశన స్థలాలు, పక్కాగృహాలు లేక ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. పేద కార్మికులను దృష్టిలో ఉంచుకుని ఇళ్ల స్థలాలు, పక్కగృహాలు మంజూరుచేయించాలని కోరారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



ఏఎస్‌పేటలో ప్రదర్శన చేపడుతున్న ముస్లింలు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ముస్లింలు గురువారం భారీ ప్రదర్శన నిర్వహించారు. హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ శ్రీరామకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలపై కక్ష కట్టి వక్ఫ్‌సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. అందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతు తెలపడం దారుణమన్నారు. మతసామరస్యాన్ని దెబ్బతీసేలా ఉన్న వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, లేకపోతే పోరాటం సాగిస్తామని హెచ్చరించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


గంగిరెడ్డిపల్లెలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఉదయగిరి: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఉదయగిరి అగ్నిమాపక కేంద్రం అధికారి అశోక్‌కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గంగిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని నారాయణ స్కూల్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. వింజమూరు అగ్నిమాపక అధికారి ఎం చంద్రమౌళి ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే చేపట్టాల్సిన చర్యలు, ఇరుకు గదుల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు స్పృహ కోల్పోయిన వారిని ఎలా రక్షించాలి, పై అంతస్తుల్లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్యాస్ లీకేజీ, తదితర ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టాల్సిన తక్షణ చర్యలను వివరించారు. అగ్నిమాపక అధికారి ఎం చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన



దుత్తలూరు: మండలంలోని రాచవారిపల్లిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పశుసంవర్ధక, జిల్లా పశుగణాభివృద్ధి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం లేగదూడల ప్రదర్శనను నిర్వహించారు. మేలుజాతి దూడలను ఎంపిక చేసి రైతులకు బహుమతులను అందజేశారు. జిల్లా పశుగణాభివృద్ధి శాఖ విస్తరణాధికారి డాక్టర్ శ్రీనివాసులు, దుత్తలూరు ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి మేలుజాతి దూడల పోషణపై అవగాహన కల్పించారు. నందిపాడు ఇన్‌చార్జి వైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్ర, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌టవర్ల నిర్మాణానికి స్థల పరిశీలన



సీతారామపురం: మండలంలోని గుండుపల్లి, చింతోడు, దేవమ్మచెరువు, జయపురం గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల నిర్మాణానికి తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి గురువారం స్థల పరిశీలన చేశారు. బీఎస్ఎన్ఎల్ అధికారులతో కలిసి సెల్‌టవర్లకు అనువైన ప్రదేశాలను గుర్తించారు. ఆర్ఐ శ్రీనివాసులు, సర్వేయరు భాగ్యలక్ష్మి, బీఎస్ఎన్ఎల్ ఏఈ శ్రీనివాసులు, జేటీఓ రామాంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్ఎంల నిరసన



వింజమూరు(ఉదయగిరి): తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వింజమూరు మండలం చాకలికొండ పీహెచ్‌సీ ఎదుట అడిషనల్ ఆరోగ్య కమ్యూనిటీ హెల్త్ సిబ్బంది గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా తమకు వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్యాధికారి మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. సిబ్బంది ఎం ఉషారాణి, ఎం సునీత, ఎం జానకి, జీ విజయలక్ష్మి, కే శివరాణి, పీ మానస, అఖిల, మాధవి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంట ఉత్పత్తులు



వరికుంటపాడు: స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ కమిటీ ఉదయగిరి ఏరియా మాస్టర్ ట్రైనర్ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పొందవచ్చని వివరించారు. ఇప్పటికే కొండాయపాళెం, విరువూరు గ్రామాల్లో ప్రకృతి విధానంలో పంటలను సాగుచేస్తుండగా, ప్రస్తుతం మరో ఐదు గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం సాగుకు ముందుకొచ్చే రైతులకు ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయశాఖ, సెర్ప్ సిబ్బంది సమన్వయంతో సహాయసహకారాలు అందజేస్తామని తెలిపారు. అనంతరం కిచెన్ గార్డెన్, కషాయాలు, తెగుళ్ల నివారణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ వేణుగోపాల్, ఏపీఎం సుధాకర్, ఏఓ రవి కుమార్, ఎస్సై రఘునాథ్, సీహెచ్‌ఓ రాజశేఖర్, సీసీలు జానకమ్మ, హబీబ్, ప్రమీల, చిన్నఅప్పన్న, లాజర్, అకౌంటెంట్ భాను, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ ప్లకార్డుల ప్రదర్శన


ప్లకార్డులను ప్రదర్శిస్తున్న కార్మికులు

ఉదయగిరి: ప్రజారవాణా సంస్థ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఉదయగిరి డిపో ఎదుట ఎన్ఎంయూ నాయకులు గురువారం ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ 1/19 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అనారోగ్యానికి గురైన కార్మికులకు జీతాలు చెల్లించాలని, పిల్లల సంరక్షణకు మహిళా ఉద్యోగులకు సెలవులు ఇవ్వాలని, గ్యారేజ్‌లోని సమస్యలను పరిష్కరించాలని, ఆన్‌కాల్ డ్రైవర్ల జీతాలు పెంచాలని, పెండింగ్ ఓవర్‌టైం నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. జోనల్ నాయకులు సలాం, జిల్లా నాయకులు మునిరత్నం, డిపో నాయకులు విజయ్‌కుమార్, శంకర్, శివకుమార్, మునీర్, రాజా, గ్యారేజ్ నాయకులు రమణారెడ్డి, ఏడుకొండలు, ముజాఫర్, జలీల్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నాగులవరం పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

సాక్షి ఎఫెక్ట్..

బిట్రగుంట: బోగోలు మండలం నాగులవరం పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఓ ఆనంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి భాస్కర్ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పాటు, ఇంటి పన్నుల వసూళ్లలో అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ గ్రామస్తులు చేసిన ఆరోపణలపై జనవరిలో 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. ఆధారాలతో సహా ప్రచురించిన ఈ కథనాలపై అప్పట్లోనే కలెక్టర్ విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జనవరి 24న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ నయీం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ విచారణకు కూడా పంచాయతీ కార్యదర్శి హాజరుకాలేదు. దీంతో గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించి అధికారులు విచారణ పూర్తి చేసి కలెక్టర్‌కు నివేదించారు. ఈ నివేదిక ఆధారంగా పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కోవూరుపల్లి పంచాయతీ కార్యదర్శిపైనా ఆరోపణలు

కోవూరుపల్లి పంచాయతీ కార్యదర్శి తరచూ విధులకు గైర్హాజరవుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గౌరవరం వద్ద దాబా హోటల్ నిర్వహించుకుంటూ విధులకు హాజరుకావడం లేదని మండిపడుతున్నారు. సచివాలయ ఉద్యోగులు సైతం విధులకు సరిగా హాజరుకావడం లేదని, ఎప్పుడు చూసినా కుర్చీలన్నీ ఖాళీగా ఉంటున్నాయని ఆరోపిస్తున్నారు. పింఛన్లు కూడా సకాలంలో పంచడం లేదని, ప్రశ్నిస్తే నెల్లూరుకు చెందిన యూట్యూబ్ చానళ్ల విలేకరులతో అట్రాసిటీ కేసులు పెట్టిస్తామని బెదిరిస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కలెక్టర్ స్పందించి మండల పరిషత్, పంచాయతీ కార్యదర్శులను గాడిలో పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


ఉదయగిరిలో మాట్లాడుతున్న సీడీపీఓ సునీత


సంగం: గర్భిణులకు బాలసంజీవని కిట్లు పంపిణీ


వింజమూరు మండలం చాకలికొండలో..

ఉదయగిరి: గర్భిణులు,బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణఆరోగ్యవంతులుగా ఉండవచ్చని ఐసీడీఎస్ ఉదయగిరి ప్రాజెక్ట్ సీడీపీఓ సునీత అన్నారు. మండలంలోని గుడినరవ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో ఆమె మాట్లాడారు. తక్కువ ఖర్చుతో దొరికే ఆకుకూరలు, చిరుధాన్యాల్లో ప్రోటీన్లు, విటమిన్లు అధికంగా ఉంటాయన్నారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ తేజస్విని, ఆరోగ్యకార్యకర్త విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, మమత, ధనలక్ష్మి, పద్మ, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం చాకలికొండ మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షకీల ఆధ్వర్యంలో పోషకాహార పక్షోత్సవాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో పోషకాహార లోపంతో తలెత్తే సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారుల బరువులను చూసి పెరుగుదలను పరిశీలించారు. అంగన్‌వాడీలు శ్రీదేవి, ధనమ్మ, సుహాసిని, కేశవరత్తమ్మ పాల్గొన్నారు.

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెం పల్లిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీలు కే కుసుమ, వీ వెంకటమ్మ, భాగ్యదేవి ఆధ్వర్యంలో పోషకాహార పక్షోత్సవాలను నిర్వహించారు. ఆత్మకూరు సీడీపీఓ సునీలత ముఖ్యఅతిథిగా హాజరై గర్భిణులు, బాలింతలు రక్తహీనతను అధిగమించేందుకు ఆకుకూరలు, పాలు, గుడ్లు, అదనపు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు బాలసంజీవని కిట్లను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన


ఆత్మకూరులో ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ సభ్యులు


ఉదయగిరి: విద్యార్థుల నమోదు పత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనను అందజేయడంతో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నారని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని వెస్ట్ మోడల్‌కాలనీ, వందూరుగుంటకాలనీలో గురువారం వారు పర్యటించారు. ఇంటింటికి వెళ్లి చిన్నారులను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని తల్లిదండ్రులను కోరారు. యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు ఎం గంగాధర్, డీ శివప్రసాద్, మురళీకృష్ణ, ఖాదర్‌బాషా, హెచ్‌ఎంలు సత్తార్‌సాహెబ్, మస్తాన్‌షరీఫ్, ఆజాద్, మస్తాన్, అంగన్‌వాడీ రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: బిజ్జంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల పరిధిలోని అన్నంపల్లి, కొత్తపల్లి, బిజ్జంపల్లి, లింగమనేనిపల్లి గ్రామాల్లో హెచ్‌ఎం షేక్ నాయబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి విద్యార్థుల నమోదు కార్యక్రమం చేపట్టారు. బిజ్జంపల్లె ఉన్నత పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, ఉచిత వ్యాన్ సౌకర్యాన్ని కల్పిస్తామని విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోని ఐదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకుని తమ పాఠశాలలో ఆరోతరగతిలో చేర్పించాలని కోరారు. అందులో భాగంగా పాతూరు మండల పరిషత్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఆరో తరగతిలో తమ పాఠశాలలో చేర్పించాలని కోరారు. అనంతరం 5వ తరగతి పూర్తి చేసిన 30 మంది విద్యార్థులు వివరాలు నమోదు చేసుకున్నారు. హెచ్‌ఎం మాలకొండయ్య, ఉపాధ్యాయులు మాల్యాద్రి, శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరావు, కొండారెడ్డి, చందన, శైలజ, మీరావలి,వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని జడదేవి, మంగాపురం, చెన్నంపల్లి, కృష్ణంరాజుపల్లి, జంగంరెడ్డిపల్లి గ్రామాల్లో ఉపాధ్యాయులు విస్తృత ప్రచారం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ఉచితంగానే కల్పిస్తున్నామని వివరించారు.